Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

# అంటరాని వసంతం - దళిత జీవన చిత్రణ

**డా. పొనుగోటి రవికుమార్,**
తెలుగు విభాగాధిపతి,అసోసియేట్ ప్రొఫెసర్,యస్.ఆర్ & బి.జి.యన్.ఆర్.
ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (A++),
ఖమ్మం.

Article Received:10-04-2025 Article Modified:25-04-2025
Article Accepted:26-04-2025 Article Published:27-04-2025
DOI:10.37854/UIJMR.2025.2.2.366

**స్థూల పరిచయం**:
అంటరానివసంతం నవలలో కొనసాగుతున్న దళితుల పోరాటం గురించి రచయిత జి. కళ్యాణరావు చర్చించాడు. ఈయన విప్లవ రచయితల సంఘంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మార్క్సిజాన్ని అనుసరించి రచనలు చేశారు. దళితులు చరిత్రలో ఎదుర్కున్న అవమానాలు, భూమికోసం వారు చేసిన పోరాటాలు, ఆ పోరాటాల క్రమంలో వారి త్యాగాలు చర్చించడం జరిగింది.

**కీలక పదాలు**: దళిత నవల, విప్లవ సాయుధ పోరాటం ,కారంచేడు, చుండూరు, ఆత్మగౌరవం,భూ పోరాటాలు, విముక్తి.

## నవల విమర్శ:

అంటరానివసంతం రచించి ఇప్పటికి 25 సంవత్సరాలైంది. యావత్తు తెలుగుప్రాంతంలో ఉన్న దళితుల స్థితిగతులను తెలియజేయటానికి అంటరానివసంతం అన్నారు. శిశిరం, గ్రీష్మం తర్వాత వసంతం వస్తుంది. శిశిరం ఆకులురాల్చు కాలం, గ్రీష్మం ఎండలు మండేకాలం, దళితుల జీవితాలు చరిత్రలో ఆకులురాలుస్తూ, వివక్షతలు అనే కష్టాల ఎండలను అధిగమించడానికి సాయుధమై పోరాటం చేసినప్పుడే వసంతం వస్తుందని ప్రతీకాత్మకంగా తెలియజేసారు. అంటరాని వసంతం ఏడుతరాల జీవితాన్ని దగ్గరగా చూపిస్తుంది. అంటరానివసంతంలో శ్రమజీవుల బతుకుపోరు, దానితో పాటు ఆటా, పాట, వాస్తవిక దళితుల జీవితచిత్రణ సృజనాత్మకంగా చెప్పటంతో ఈ నవల కవితాత్మక కావ్యంగా ఆవిష్కరణ జరిగింది. బ్రిటీష్ వారి కాలంలో కూడ బ్రాహ్మణులు ఆధిక్యత కొనసాగినట్లు అంటరాని వసంతం నిరూపిస్తుంది. ఈ

నవల దళితుల జీవనంలోని చారిత్రక క్రమాన్ని వ్యాఖ్యానించింది. ప్రకాశం జిల్లాలో అంటరానివారు అనుభవించిన కష్టాలను, క్రైస్తవ మతంలో చేరిన తరువాత వారి జీవితాలలో కలిగిన మార్పులు కమ్యూనిస్టు ఉద్యమం నేపథ్యం నుండి రచయిత నవలలో వివరించారు. దళితుల కళాప్రావీణ్యాన్ని అగ్రవర్ణాలే కాక చరిత్రకారులు కూడ అణచివేశారని రచయిత భావించాడు.

కళ్యాణరావు నవలలో దళిత జీవన చిత్రణ సౌందర్యాన్ని విపులంగా తెలియజేసాడు. నవలను కవిత్వంతో వడ్డించాడని అనుకునేంతగా కవితాత్మక వాక్యాలే నవలంతా పరచుకుని పాఠకులకు కనువిందు చేస్తాయి. రచయిత కథనం ఉత్తమపురుష సర్వదృష్టికోణాల నుండి కొనసాగింది. ఈనవల ఒక చారిత్రక ఘట్టం వద్ద మొదలై మరొక ప్రధాన చారిత్రక ఘట్టం వద్ద కొనసాగుతోంది. అంటరానివసంతం నవల దళితుల అంటరానితనం వద్ద ప్రారంభమై సాయుధపోరాటమే పరిష్కారమార్గమని చెప్పడంతో ముగుస్తుంది. ఈ రెండూ చారిత్రకఘట్టాలే. ఈ రెండు ఘట్టాల మధ్య ధాతుకరువు, సి.పి. బ్రౌన్ ప్రస్తావన, రాజుపాలెం దగ్గర - దళితుల బకింగ్హాం కాలువ తవ్వకం, క్రైస్తవమత వృద్ధి, వైకం సత్యాగ్రహం, పెరియార్ పోరాటం, గాంధీ హరిజనోద్యమం, అంబేద్కర్ పోరాటం, తెలంగాణ పోరాటం, సాధారణ ఎన్నికలు, శ్రీకాకుళోద్యమం, కారంచేడు, చుండూరు మరణకాండల ప్రస్తావన, నక్స లైట్ సాయుధ పోరాటం అనే చారిత్రక విషయాలను తీసుకుని ముఖ్యమైన పాత్రలకు వాటిని అనుసంధానిస్తూ రచయిత ఎంతో చాకచక్యంగా కథను నడిపారు. గాయపడిన గొంతుకలు పాటలు పాడటం ఎలా సాధ్యం కాదో అలాగే అణిచివేతలకు గురవుతున్న దళితజనం దాన్ని తిప్పికొట్టలేకపోయారు. ఈ నేలపై ఎస్సీలు పడిన కష్టాన్ని రచన సమయంలో రచయిత కూడా పడివుండవచ్చు. ఎందుకంటే సాహిత్య సృజన అనేది అనుభవనేపథ్యం నుండే వస్తుంది. అలా వచ్చిన సాహిత్యమే పాఠకుల హృదయాలను తాకి సహృదయాల మెప్పును పొందుతుంది. దళిత సాహిత్యంలోనే కాకుండా తెలుగుసాహిత్య చరిత్రలో ఈ నవల చిరస్థాయిగా నిలిచి పోతుందని చెప్పవచ్చు.

**కులవ్యవస్థ-అంటరానివసంతం:**

నవల అంతట కులవ్యవస్థ వికృత స్వరూపం కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించాడు. నవల కవర్ పేజీ నుండే మొదలవుతుంది. దళితులు భూమికోసం చేసిన పోరాటం స్పష్టంగా ఉంది. అస్తిత్వవాదాల ప్రశ్నల స్పందనలకు ప్రతిస్పందనలతో భూమి కేంద్రంగా నవల కొనసాగుతుంది.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

దాన్ని సాధించుకోవడానికి మొదటతరం నుండి ఆధునికకాలం వరకు మాలమాదిగలు చేసిన పోరాటం చిత్రీకరింపబడింది. ఆదరణతో కూడిన ఆత్మగౌరవం కోసం క్రైస్తవమతాన్ని పుచ్చుకున్నారు. కానీ అక్కడ కూడా అగ్రకులాలు చొరబడ్డాయి. ప్రధానమైన వనరులను చేజిక్కించుకున్నాయి. కమ్యూనిజం పీడిత ప్రజల విముక్తి నినాదంతో వచ్చినప్పుడు వారిని ఎస్సీలు అనుసరించారు. కానీ కమ్యూనిస్టులు కులనిర్మూలనను పట్టించుకోకుండా వదిలివేశారు. కులం గురించి మాట్లాడిన వారిని కులతత్వవాదులుగా వెలేశారు. దాంతో అంబేద్కరిజ చైతన్యంతో తెలుగు ప్రాంతంలో దళిత ఉద్యమాలు మొదలయ్యాయి,

అంటరానివసంతంలో కథను రూబేను భార్య రూతుకు తన తాత ముత్తాతల గాథను వివరంగా చెబుతాడు. దళితుల కథకు పురాణాలతో కూడా సంబంధం ఉంది. దేవతల శాపం వల్ల జాంబవంతుని వారసులుగా మాదిగలు చచ్చిన గొడ్లను తింటూ, చెన్నయ్య వారసులుగా మాలలు వీధులు ఊడుస్తూ బ్రతుకుతున్నారు. ఎన్నెలదిన్నికి మకుటం లేని మహారాజు పెద్ద కరణం మనువడు మరొకరూపం తన కులాధిక్యతకు ఎవరు అడ్డువచ్చిన హత్యారాజకీయాలకు కూడా వెనుకాడడు. తన పనులకు అడ్డు వచ్చారని నారయ్యను, తన కూతురితో అక్రమసంబంధం పెట్టుకున్నాడని కొళ్ళదిన్నె పంతుల్ని, తన కూలీ డబ్బులు లెక్క చూడమన్నందుకు అచ్చిరెడ్డి తండ్రికవలుకిని చంపిస్తాడు. కరణం బ్రతికి ఉన్ననాళ్ళు కులవ్యవస్థ చెక్కు చెదరలేదు. ఆ ఊరి చుట్టూ ఉన్న భూములన్ని కరణానివే. రెడ్లు కూడా ఇతని కింద ఉన్న పొలాలు **రౌలు** తీసుకుని వ్యవసాయం చేసుకునేవారు.

ఎల్లన్న చిన్నతనంలోనే కులనాగు విషకాటుకు భయపడి పారిపోయాడు. ఆ పారిపోవడం నవల గమనంలో కీలక మలుపుకు కారణమయ్యాడు. కులాధిపత్యాన్ని ధిక్కరించిన నారయ్యను చంపడంతో తల్లితో కలిసి నాగన్న ఎన్నెలదిన్నకు దూరమయ్యాడు. ఎల్లన్న రాకతో నాగన్న ఎన్నెలదిన్నెకు దగ్గరై ఆ ఊరికి ఆత్మగౌరవాన్ని నేర్పాడు. తవ్వాలసింది, పూడ్చాల్సింది ఎంతో ఉందని చెప్పాడు. ఊరిలో నాటకం వేస్తే నిమ్నకులాలు ఎక్కడో దూరంగా ఉండి అగ్రకులాల వారికి కనబడకుండా చూడాలి. ఇది కళారంగంలో తీవ్రమైన వివక్ష. నాటకం ఆడటానికి వచ్చిన వారిని చూడడానికి వెళ్ళిన పసి ఎల్లన్నపై కులసమాజం తీవ్రంగా దాడి చేసింది. నాటకం చూడడానికి వెళ్ళి దెబ్బలు తిని పారిపోయిన ఎల్లన్నను ప్రధానపాత్రగా నాగన్న నాటకం నేర్పుతాడు.

అగ్రకులాలకు దీటుగా ఆ నాటకానికి మాలమాదిగల పెద్దలను సగౌరవంగా రంగస్థలంపైకి ఆహ్వానిస్తాడు. ఆత్మగౌరవ పతాకంగా ఎగురుతాడు. పక్కఊరిలో నాటకానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు అచ్చిరెడ్డి మామ మాలమాదిగలను పిలిచి ఆడవద్దని హెచరిస్తాడు. ఆట ఆడితే మాలమాదిగ పెద్దలను రంగస్థలంపైకి పిలవకుండా ఆడమని చెబుతాడు. అలా కాదని ఆడితే రెండు పల్లెలను తగలబెడతానని బెదిరిస్తాడు. దాంతో వారు భయపడి ఆట ఆడ వద్దంటారు. నాగన్న ఆత్మగౌరవానికే కాదు దళితుల ఆత్మగౌరవానికే భంగం వాటిల్లినట్లుగా భావించుకుని, నాగన్న తన నిరసనను తీవ్రంగా తెలియజేస్తూ రాత్రంతా పాటలు పాడి, పదాలు చెప్పి మరణిస్తాడు. నాగన్న కళాకారుడు కనుకే అతనికి స్పందించడం తెలుసు. అందుకే ఆత్మగౌరవం దెబ్బతిని అతని గుండె స్పందించలేక ఆగిపోయింది. కావున నాగన్న చావుని కులసమాజం చేసిన హత్యగానే పరిగణించాలి.

మాతయ్య కరణంను చంపే సమయానికి ఎన్నెలదిన్నిలో రాజకీయ, ఆర్థికాంశాలు మార్పులకు గురవుతున్నాయి. అందులో భాగంగా రెడ్లు ఆర్థికంగా బలపడుతున్నారు. ఇలా బలపడడంతో పిల్ల కరణం మాలలు, రెడ్ల మధ్య పొలం గట్లు వద్ద శాశ్వతంగా చిచ్చు పెట్టి పట్టణం వలస వెళ్ళిపోయాడు. దళితులకు భూమి అవసరమని నమ్మి వ్యూహం ప్రకారం మాలోడిదిబ్బను ఆక్రమించుకునేలా పథకం పన్ని విజయవంతంగా పూర్తి చేసారు. రెడ్లు, పిల్లకరణం మధ్య జరుగుతున్న ఆధిపత్యాపోరురును పావుగా వాడుకుంటారు. కరణం పట్టణజీవితంలో తమ అధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం క్రైస్తవమతాన్ని స్వీకరించారు. కులభావన లేని క్రైస్తవంలో కులభావన ప్రవేశపెట్టి ఆ మతాన్ని బ్రాహ్మణీయకరించాడు. తమ ప్రయోజనాల కోసం మతం మారి శాస్త్రి, రెడ్డి, కమ్మ వారు క్రిస్టియన్స్ గా సరికొత్త అవతారమెత్తి క్రైస్తవమతానికి కులాన్ని ఆపాధించారు.

మాలబైరాగిగా మారిన ఎల్లన్నను కలుసుకోవడానికి కుమ్మరాయన బయలుదేరాడు (పు. 91). ఎల్లన్నను కలిసి ఆయన పాటల్ని లిఖించాడు. తనతో పాటు ఎవరూ నడవని దారికి వేదక పరిచయం చేస్తూ ముందుకు సాగాడు. బ్రాహ్మణ బజారులో నడిచి వెళ్తున్న కుమ్మరాయన్ని అటకాయించారు. అగ్రవర్ణాలు కుమ్మరి కోటేశ్వరరావుపై దాడి చేసి చంపేశారు. మాలామాదిగ, యానాది పల్లెలు పుట్ట పగిలినట్లు వచ్చారు. బహుజనులు కలిసికట్టుగా రావడం

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

ఇదే మొదలు, ముందు ముందు మరి కొన్నిచోట్ల ఈ కలయిక కనబడుతుంది. వీరందరినీ మాలబైరాగి అనబడే పాటేల్లడు కలవగలిగాడు. కిందికులాలు ఆత్మగౌరవంతో తలెత్తుకున్నప్పుడల్లా బ్రాహ్మణీయ భావజాలం దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తుంది. కుమ్మరి కోటేశ్వరరావు హత్య ఇలాంటి సన్నివేశమేనని చెప్పవచ్చు.

కుమ్మరి కోటేశ్వరరావు చితికి ఎల్లన్నే నిప్పుపెట్టాడు. అస్తికల మీద సమాధి కట్టారు. అది బహుజనానికి సందడి స్థలమై మాట, పాట, ఆట కలిసిన బహుజన సంస్కృతికి ప్రతీకలుగా మారి కులవ్యవస్థలకు సవాలుగా బహుజనతత్వం మొగ్గ తొడగడానికి దోహదపడతాయి. ఆ పనే ఈ నవలలో ఎల్లన్న చేయడం జరిగింది. అగ్రకులధిపత్యంలో ఆట ఆగిపోయిన తర్వాత ఎల్లన్న ఉద్యమకారుడుగా మారతాడని అనుకుంటాం.. కానీ ఎల్లన్న పాటగా ప్రకృతిలో ప్రయాణించాడు. బహుజన భావాలు ప్రజావనంలో వెదజల్లాడు. ఆ భావాలు తర్వాత కాలంలో విప్లవోద్యమంగా మొగ్గతొడిగాయని చెప్పవచ్చు.

ఈ నవలలో సుభద్ర అగ్రకులాల అధిపత్యాన్ని తీవ్రంగా ఎదుర్కొంది (పు. 105).దాంతో హతాశులైన అగ్రకులాలు సుభద్రకు దేవత పూనిందని ప్రచారం చేసి తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించారు. కరువు కాలంలో కులవ్యవస్థ వికృతరూపం దాల్చినట్లుగా రచయిత చిత్రీకరించారు. బకింగ్హాం కాలువ త్రవ్వకాల్లో శివయ్య, శశిరేఖలు పని అడిగారు. పేరు, కులమడిగారు మాలోడ్నినని అనగానే అగ్రకుల కూలిలందరూ శివయ్య దంపతులపై దాడి చేశారు. వారి కులమడిగారు, "ఎన్నెలదిన్ని చేతుల నుండి తప్పించుకుని దూరంగా పరిగెత్తారు. మార్టిన్ ఆదరణలో వారు కోలుకున్నారు." బకింగ్ హోం కాల్వ కూలీ పనిలో తాము చేసేది కూలీ పని అయినా అగ్రకులాల కూలీలు మాలమాదిగలు తమతో కలిసి పని చెయ్యడానికి ఒప్పుకోలేదు"(పు. 133). పేదలందరూ ఒకే వర్గమని చెప్పే అగ్రకుల మార్క్సిస్టులకు కులతత్వాన్ని అర్థం చేసుకోవడానికి పై సన్నివేశాలు ఉదాహరణగా చెప్పవచ్చు.

ఆసాముల పొలాల్లో పని చేసే మాలమాదిగ, వెట్టి వారికి కూలికి గింజలు ఇచ్చేవారు. ఆ గింజలు కొలిచే చేటలు ఇండ్లలోకి తీసుకెళ్ళకుండా గొడ్ల కొట్టాం చూరుల్లో పెట్టేవారు. అగ్రకులాలు వాళ్లు మాదిగపల్లెలోకి వచ్చినప్పుడు మంచాల మీద మాదిగలు కూర్చొకూడదు. కానీ చిన్నోడు లేవలేదు. తనకి నచ్చని విషయంపై చిన్నోడు మూగగా తిరుగుబాటు చేసేవాడు. చిన్నోడిలో

జరుగుతున్న సంఘర్షణ కులవివక్షత భరించలేక, చిన్నాడు మార్టిన్గా రూపుదాల్చాడు. అలా ఇక్కడ దళితులు కులవ్యవస్థ నుండి బయట పడడానికి అనేకానేక ప్రయత్నాల్లో మతమార్పిడి కూడా ఒక్కటిగా చెప్పవచ్చు.

**మిషనరీల్లో కులవివక్షతలు:**

మిషనరీల్లో కులవివక్షతలు ఉన్నాయని ఈ నవల చెబుతుంది. మార్టిన్ భూమి విషయంలో దొరలతో మొరపెట్టుకున్నాడు. అగ్రకుల క్రైస్తవులవల్ల భూమి రావడం అలస్యమైంది. భూమి చేతిదాక వచ్చిన తరువాత అగ్రకుల హత్యాకాండకు మార్టిన్ బలి అవుతాడు. ఈ దాడి ఆధునికకాలంలో జరిగిన అగ్రకుల దాడుల నేపథ్యం నుండి తీసుకోవడం జరిగిందనవచ్చు. మాలమాదిగలు కులవివక్షతల నుండి బయటపడి ఆత్మగౌరవంతో బతకడానికి క్రైస్తవమతాన్ని తీసుకున్నారన్నాడు. కానీ అగ్రకులాలు తమ ప్రయోజనాల కోసం మతం మారి శాస్త్రి, రెడ్డి, కమ్మ, క్రిస్టియన్స్ సరికొత్త అవతారమెత్తి క్రైస్తవమతానికి కులాన్ని ఆపాదించారు.

మతం మారడంతో కొన్ని సంస్కరణలు వచ్చాయి. గొడ్డుమాంసం తినమని తీర్మానించుకున్నారు మాదిగలు. అప్పటి వరకు గొడ్డుమాంసం తింటున్నారని మాదిగలను దూరంగా పెట్టిన అగ్రకులాలు చచ్చినగొడ్డు మాంసం తినమని బలవంతం చెయ్యడం చిత్రమైన అంశం. చచ్చినగొడ్డును మాదిగలు తినకపోతే వారిపై ఆధిపత్యం చేయడం కుదరదు. కనుక సినవెంకడ్ని పూడ్చిన గొడ్డును తీసి తినమన్నారు, తినిపించారు. గొప్ప ఆచారాన్ని తాము కాపాడినట్లుగా తలెత్తుకు వెళ్ళిపోయారు. చచ్చినగొడ్లను తినడం మానివేయమని చెప్పేముందు మార్టిన్ మాదిగలతో మాట్లాడుతున్న సందర్భంలో చచ్చినగొడ్డును తీసుకోవడం మాహక్కని పెద్దమాదిగ అన్నాడు. దాంతో "క్రిష్ణానది పొలాలు కమ్మవాళ్ళ హక్కు, పెన్నానది పొలాలు రెడ్ల హక్కు అక్కడా యిక్కడా చచ్చిన గొడ్లు మాత్రం మాదిగవాళ్ల హక్కు" (పు.143) చెప్పడం మాదిగల వాస్తవిక స్థితిని రచయిత ఎరుకపరిచాడు.

అవలపాడులో కమ్యూనిస్టుల ప్రభావంతో చెరువు నీటికోసం పోరాటం చేయవలసి వచ్చింది. ఈ పోరాటంలో రామిరెడ్డి, చాకలివాళ్ళు మాలపల్లెకి మద్దతుగా నిలబడ్డారు. అవలపారు చెరువు నీళ్ళ పోరాట ఘటన ప్రకాశం జిల్లా కారుమంచిలో రెడ్లకు మాలలకు మధ్య జరిగిన సంఘర్షణను గుర్తుకు తెస్తుంది. పోలీసులు అవలపాడుపై నిఘా పెట్టారు, అక్కడి ప్రజల్ని హింసించారు. పెద్దనర్సింహాను గులాం భరంతో చిత్తుచిత్తుగా కొట్టడంతో చౌదుర్ల జొన్న చేలంతా మధ్యలో పీకేశారు. దొంగతనం చేసిన బాలకోటడ్ని కొట్టడం,

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

దొంగతనంగా గడ్డి కోస్తున్న ఆడవారిని చౌదరి బంధించడం, పల్లెలో ఆడ, మగలతో పాటు దాకలివాళ్ళను కూడా కూడగట్టుకుని వెళ్ళి విడిపించారు. పై ఘటనలన్ని అగ్రకులాలు దురంహాంకారంతో తమపై దాడి చేస్తే మాల, మాదిగ, చాకలివాళ్ళు కమ్యూనిజనేపథ్యంతో ఐక్యంగా ఎదుర్కొన్నారని చెప్పవచ్చు

**అంటరానివసంతం-మాలమాదిగలు**:

కళ్యాణరావు మాలా మాదిగలు కలిసి పోరాటం వేసినట్లు నవలలో చిత్రీకరించాడు. సమాజ వాస్తవికత అందుకు భిన్నంగా ఉంది. వీరి ఐక్యత కాల్పనికత కాకపోవచ్చు. కానీ వీరి మధ్య నవలలో పేర్కొన్నంతగా సహాజీవనం లేదు. దీనికి పెద్దకరణం లాంటి వాళ్ళు విభజించి పాలించడమే ప్రధాన కారణమనవచ్చు. నారయ్య, మాతయ్య మంచి స్నేహితులు, మాలా మాదిగ జనాంగాన్ని మోషే వలె వరద నుండి రక్షించారు, వారి ఆకలి తీర్చారు. నారయ్యలో ఆలోచన ఉంది. మాతయ్యలో ఆవేశం ఉంది. నారయ్య తాను చేయబోయేది చెబుతాడు. తన తోటి వారిని ఉత్సాహపరిచి, ఉద్రేకాన్ని కలిగిస్తాడు. మనిషిని కదిలించగల శక్తి నారయ్యది. మాతయ్య ఏదైనా పనిని ఆవేశంగా పూర్తి చేస్తాడు. ఏమి మాట్లాడడు. మాట్లాడితే పని అయిన తర్వాతే, ఈ విషయం మనకు వరద సమయంలో వారి మాటల, శరీరప్రవర్తనను బట్టి అర్థం చేసుకోవచ్చు. అలాగే మార్టినాపాత్ర, మాతయ్యపాత్రకు కొనసాగింపుగా ఉంటుంది. మార్టీన్లో కూడా ఆలోచనలతో పాటు ఆవేశం ఉంటుంది. ఆవేశంలోనే భూమి కోసం పోరాటం చేస్తుంటే అగ్రకుల హత్యకాండకు బలి అవుతాడు. ఈనవలలో మాదిగపాత్రలను ఆలోచనలేని పాత్రలుగా, ఆవేశపరులుగా చిత్రీకరించాడని మాదిగ సాహిత్యకారుల అభిప్రాయం.

ప్రకాశంజిల్లాలో క్రైస్తవమతాన్ని ఉద్యమస్థాయిలో మాదిగలు పుచ్చుకున్నారని క్లౌ దొర సతిమణి ఎమ్మా రోషంబు మాదిగల సాంఘీక జీవనం గురించి పరిశోధన చేసి రాశారు. ఆ పుస్తకం వి.వి. నా. మూర్తి 'చెప్పులు కుడుతూ కుడుతూ' అనే పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. అందులో రోషంబు సమాజంలో మాలామాదిగలు "సమానంగా వెలివేయబడినవాళ్లే. అయినా మాలమాదిగలు ఒకరికి ఒకరు విడివిడిగా ఉంటారు. వాళ్ళ నూతులు వేరు, కలిసి తినరు. వాళ్ళ మధ్య పెళ్ళిళ్ళు జరగవు" (మూర్తి, బి.వి.ను 2011, 107) అని ఇరువురి కుటుంబ జీవనం గురించి పరిశోధించి వ్యాఖ్యానించారు. అందుకు భిన్నంగా రచయిత మాలామాదిగల మధ్య సంబంధబాంధవ్యాలను చిత్రీకరించారు.

మాలల ఉరుముల నృత్యాన్ని చాలా గొప్పగా చిత్రీకరించడం జరిగింది. ఇది అంతరించి పోతున్న కళ, అనంతపురంజిల్లాలోనే మిణుకు మిణుకుమంటూ ఉంది. కనుమరుగు అవుతున్న కళను గురించి రాయడం అవసరమే. అయితే సమస్త జనాన్ని ఉత్సాహపరిచి చైతన్యాన్ని నింపుతున్న డప్పును గురించి కళ్యాణరావు ప్రస్తవించలేదు. డప్పును క్రమంగా ఆధిపత్య ఉద్యమాలు తమ సొంతం చేసుకుంటున్నాయి. డప్పు ప్రపంచమై మారు మ్రోగుతుంటే రచయితకు మాత్రం మాదిగడప్పు అంటరానిదయ్యింది. నవలలో మాదిగల సాంస్కృతిక జీవనాన్ని రచయిత చిత్రీకరించలేదని విమర్శ ఉంది.

కరణం పొలంలో మాలామాదిగలు వెట్టికి పనిచేయాలి. మధ్యాహ్నం కూటి కావిళ్ళే కూలి. ఆ కూటి దగ్గర కూడా తన్నులాట పెట్టి చోద్యం చూసేవాడు. తర్వాత కల్లాం గింజల దగ్గర మాల మాదిగల మధ్య తగాదాల కోసమే ఆ గింజలను వదిలే వేసేవాడు. వారు తన్నుకు చస్తే మధ్యలో దూరి ఇద్దర్ని మందలించేవాడు. మాల మాదిగలు ఎప్పటికీ కలవకుండా మనువులా మధ్య ఎప్పుడూ విభజన గీతలు కనబడకుండా గీసేవాడు. బ్రాహ్మణీయ భావజాలం,/విభజించి పాలించడం. తమ అధిపత్యానికి సవాలు చేసిన వ్యక్తులను చంపడం. ఇంకెవరు అలాంటి ఆలోచన చేయకుండా జాగ్రత్త వహించడంలో భాగమే నారయ్య హత్యని చెప్పవచ్చు. ఒక కులం కంటే మరో కులం గొప్పదని నిచ్చెనమెట్ల కులవ్యవస్థ స్థిరీకరించుకొని అగ్రభాగాన కూర్చోవడమే మనువాదం. ఈ ప్రభావం నుండి బయట పడినప్పుడే దళిత విముక్తి సాధ్యమవుతుంది.

## అంటరానివసంతం దళితు విముక్తి మార్గం:

దళితుల విప్లవ విముక్తికి సాయుధ పోరాటమే మార్గమని విరసం ప్రచురించిన నవల ఇది. అంతవరకు అయితే ఫర్వాలేదు. రచయిత మాల కులానికి చెందినవాడు. అప్పటికే వామపక్ష ఉద్యమాలను అగ్రకులాల చేతుల్లోనే ఉంచుకున్నారని దళితులు కమ్యూనిస్టుల నుండి వేరుపడుతున్న, పడిన సందర్భమది. దండోరా ఉద్యమం నేపథ్యంలో దళితుల్లో సమానపంపిణి కోసం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ఉద్యమ సమయమది. ఆ సమయంలో వచ్చిన అంటరానివసంతం నవల అంబేద్కరిజాన్ని పూర్తిగా విస్మరించింది. కంచికచర్ల, కారంచేడు, చుండూరులలో దళితుల మీద జరిగిన మరణకాండలను ప్రస్తవించింది. ఆ మరణకాండలను నిరసిస్తూ అంబేద్కరిజం

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

నేపథ్యంలో పనిచేస్తున్న దళిత ఉద్యమాల్ని మాటవరసకు కూడా రచయిత గుర్తుకు తెచ్చుకోలేదు. దళిత ఉద్యమాల పట్ల దాటవేత వైఖరి రచయిత అవలంభించాడు. కానీ విప్లవోద్యమాల అస్తమయ సమయంలో దళితసమస్యలకు పరిష్కారం తుపాకిగొట్టం ద్వారానే సాధించవచ్చని దళితుల్ని సాయుధపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశం.

ఈ నవల దళితసమస్యల పరిష్కారం గురించి మార్క్సిస్టు దృష్టి నుండి చర్చించింది. ఈ నవలలో రచయిత ప్యూడల్ భూస్వామ్యం నుండి స్వాతంత్ర్యానంతరం వరకు సమాజంతో పాటు దళితుల్లో వచ్చిన మార్పులను చర్చించడానికి నూటయాభై సంవత్సరాల కాలాన్ని చిత్రించాడు. రచన కవిత్వంలా వాస్తవికంగా నవల సాగుతుంది. కమ్యూనిస్టులు సమాజాన్ని 1) ధనికవర్గం 2) పేదవర్గం గుర్తిస్తారు. వర్గానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి కులాన్ని ద్వితీయంగా భావిస్తారు. కానీ ఈ నవలలో కులం ప్రథమం, వర్గం ద్వితీయమైంది. బకింగ్ హెూం కాలువపనుల్లో అగ్రకులకూలీలు, దళితకూలీలను పనికి రానివ్వకుండా బాగా కొట్టి వెళ్ళగొడతారు. అందుకే అంబేద్కరిజం కులమే పునాది అంటుంది. మార్కిస్టులు ఆర్థికాంశాలు పునాది అంటారు. అంబేద్కరిజం పార్లమెంటరీ ప్రజాస్వామ్యపద్ధతుల ద్వారా బహుజనులు ఐక్యమై రాజ్యాధికారం సాధించాలని పిలుపునిస్తుంది. అందుకు అనుగుణంగా అంబేద్కర్ స్వయంగా రాజకీయపార్టీని స్థాపించాడు. మార్కిస్టులకు బ్యాలట్ మీద నమ్మకం లేక బుల్లెట్(సాయుధ పోరాటం) ద్వారానే రాజ్యాధికారం సాధించాలని నమ్ముతారు. "మిలిటెంట్ దళితనాయకత్వం లేకుండా దళిత బహుజనులను రాజ్యాధికారం ఊక దంపుడు నినాదమే" (కేశవ కుమార్: 1995, 3) అని జి కళ్యాణరావు భావించారని కేశవ కుమార్ అంటారు.

**అంటరానివసంతం – భూ పోరాటాలు**:

దళితల కళలు ఎలా దోపిడికి గురయ్యాయో ఎల్లన్న, పెద్ద కోటేశ్వరరావు, యానాది రమణయ్య పాత్రల ద్వారా విపులీకరించాడు. ఆ కళలని చివరివరకు గుర్తుచేసుకుంటూ నవలంతా వచన కవిత్వమా అన్నట్లు సాగుతుంది. నవలలో చెప్పిన చారిత్రకాంశాలు వాస్తకానికి దగ్గరగా, పాత్రలు కాల్పనీకరణకు భూమి సమస్య ప్రధానంగా నవలలో కొనసాగుతుంది. భూమి ప్రాధాన్యతను నాగన్న గుర్తించి, మాలాడిదిబ్బ నుండి అచ్చిరెడ్డి పొలం వరకు మనపొలాల గట్లు పడాలని చెబుతూ "అది అచ్చిరెడ్డి అబ్బసొమ్ము కాదు... కరణం లెక్కలోకి రాదు"

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

(పు.84) అని చెప్పడం భూప్రాధాన్యతను గుర్తించడంగా చెప్పవచ్చు. తర్వాత మార్టిన్ భూమి గురించి మాట్లాడుతూ తలెత్తుకు తిరగడానికి మడి చెక్క రావాలి. ఈ వంటికింత తిండి సొంతంగా... రెండూ కావాలి. రెడ్డికి రెండూ ఉన్నాయి. చౌదరికి రెండూ వున్నాయి" (పు. 154). ఇంకా కృష్ణా, పెన్నా నదుల మధ్య పొలాలు అగ్రకులాలు పంచుకుంటే మాదిగలు మాత్రం చచ్చినగొడ్ల మీద హక్కుల గురించి మాట్లాడుకోవడాన్ని ఎత్తిచూపుతాడు. దళితుల వెనుకబాటుతనానికి కారణం ఆర్థికాంశమని దానికి ప్రధాన కారణం భూమి దళితుల చేతుల్లో లేకపోవడంగా గుర్తిస్తాడు.

రూబేను తమ తాతతండ్రుల ఆరాటంభూమి అని తెలుసుకున్నాడు. "నా పూర్వీకులు పోగొట్టుకొన్న దాన్ని వెతుకుతున్నాను. నానమ్మ చెప్పింది. మీతాత యిట్లాగే వెతికాడని, అమ్మ అంది మీనాన్న వెతుకుతూనే వెళ్ళిపోయాడని, తర్వాత నానమ్మా వెతికింది. అమ్మా వెతికింది... నాతో పాటు నావాళ్ళంతా వెతకటం మొదలు పెట్టారు. వెతగ్గా వెతగ్గా భూమంతా వెతగ్గా ఆ అంచు నుంచి ఈ అంచు కొచ్చాక నావాళ్ళు పోగొట్టుకొన్న భూమి లెక్కతేలింది" (పు 178) అని రూబేను డైరీ రాసుకున్నాడు. ఈ పేరా రూబేను చైతన్యాన్ని పట్టి చూపుతుంది. తమ పూర్వీకులు దేనికోసం ఆరాటపడ్డారో స్పష్టంగా తెలుసుకున్నాడు. తెలుసుకున్న విషయాల్ని తన తర్వాతి తరం వారికి అప్పగించాడు. ఆవలపాడు చైతన్యం యిమ్మానియేలును విప్లవోద్యమం వైపు నడిపించింది. శ్రీకాకుళపోరాటంలో అతడు అమరుడయ్యాడు. కానీ స్పష్టమైన సమాధానాలతో కొడుకు జెస్సి కులనిర్మూలన కోసం సాయుధపోరాటం ఎంచుకున్నాడు. వీరికి కులస్పృహ ఉన్నప్పటికి వీరిది ప్రధానంగా వర్గ దృష్టి, దళితుల్లో కూడా వర్గం తయారవుతుందని తెలియజేయాడానికి రోజీ, వందనం పాత్రలను రచయిత సృజించాడు. దళిత ఉద్యమాల కాలానికి చెందిన జెస్సీ కూడా సాయుధ పోరాటాన్నే నమ్మాడు. కమ్యూనిస్టులు కులనిర్మూలన వర్గనిర్మూలనలో భాగంగా జరుగుతుందని ఆశించారు. కానీ ఆశాభంగం అయింది. అయినా నవలలో దళితులు భూసమస్యని ఆత్మగౌరవ పరిష్కారంగా అధ్యయనం చేసినప్పటికీ సాయుధపోరాటం వైపే మొగ్గు చూపారు.

**ముగింపు**:

విప్లవోద్యమ నవల అయినప్పటికి దళితనవలగా ప్రచారం అయింది. కానీ వాస్తవానికి అంటరానివసంతం దళితనవల కాదు. ఇందులో దళిత జీవితం, దళితుల పోరాటం ఉంది. కానీ దళితవాదం ఎక్కడా ప్రస్తావించబడలేదు.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

దళితుడు రాసినంత మాత్రాన దళిత సాహిత్యం కాదు. అందులో అంబేద్కరిస్టు చూపు తప్పక ఉండాలి. అలా ఉన్నప్పుడే అది దళితసాహిత్యం అవుతుంది. అందుకే ఈ నవలను దళిత నవలగా అంగీకరించలేమనవచ్చు. అంబేద్కరు సాయుధ పోరాటాల వైపు ఎప్పుడూ దృష్టి సారించలేదు. దళితులు సాయుధలై ఉండమన్నాడు. కానీ సాయుధపోరాటం ద్వారా రాజ్యాధికారాన్ని ఆయన ఎన్నడూ కోరుకోలేదు. అంబేద్కర్ పార్లమెంటరీ ప్రజాసామ్యపోరాటాన్ని ఎన్నుకున్నాడు. ప్రజాస్వామ్యపద్ధతుల ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుందామని బహుజనులకు ప్రజాస్వామ్యంలో రాజకీయ అధికారమనేది 'మాస్టర్ కీ...' దళితులకు కావాల్సింది పదవి కాదు. అధికారం అని అంబేద్కర్ పిలుపు నిచ్చాడు. రచయిత దళిత సమస్యలకు సాయుధ పోరాటమే పరిష్కారమన్నాడు. ప్రజాస్వామ్య పద్ధతులపై నమ్మకం లేక పోతేనే సాయుధ పోరాటం మీద నమ్మకం ఉంచుతారు. ఆ నమ్మకాన్నే రచయిత కనబరిచాడు.

అంటరానివారి చరిత్రకు రూపమిచ్చింది అంటరాని వసంతం. ఏడుతరాల చరిత్రను వారి జీవితాల్లోని ఏడుతరాల సంఘర్షణను, సంస్కృతిక జీవనాన్ని, మత, రాజకీయ, ఆర్థిక కోణాలను ఈ నవల విశ్లేసించింది. ఏడుతరాల చరిత్రలో లింగాలు, ఎర్రెంకడు, భూదేవి, వెంకటనర్సు, నారిగాడు, మాతయ్య, నాగన్న, ఎల్లన్న, సుభద్ర, పిట్టోడు, పోలయ్య, శివయ్య, శశిరేఖ, మార్టిన్, శారమ్మ, రూబేను, రూతు, యిమ్మనియేలు, మేరి సువార్త, జెస్సీ, రూబీలు ఏడు తరాలకు ప్రతినిధులు. నవలలో చైతన్యానికి నారిగాడు, మాతయ్యలు ప్రతీకలు. వాళ్ళు విరువురు భూమి దున్నారు. నాగన్న విత్తనాలు చల్లాడు. ఎల్లన్న మొలకెత్తాడు. మొలకగానే పరిమలించి, ఆ పరిమళాన్ని చుట్టూ ఉన్న ప్రదేశాల్లో ఎదజల్లాడు. ఆ పరిమళమే ఆ చైతన్య స్థిరత్వరూపమే జెస్సీ, రూబీలు.

ఈ నవలలో దళితజీవనం, దళితసమస్యలు, వేదనలు ఉన్నాయి. కాని వాటికి పరిష్కారాలు మాత్రం మార్క్సిజంలో వెతికారు. అందుకే ఈ నవలను విప్లవ నవలగానే పరిగణించాలని చెప్పవచ్చు. 'అంటరాని వసంతం' పూర్తిగా మావోయిస్టు స్పూర్తితో నడిచే నవల. నిజానికి నవలలో మూడు ముఖ్యమైన విశేషాలు కన్పిస్తాయి. 1) కథలోని దళిత పాత్రధారులంతా దాదాపుగా దళిత క్రైస్తవులు, 2) చర్చాంశం కులసమస్య 3) పరిష్కార మార్గం మాత్రం మార్క్సిజం. దళితుల విముక్తికి మార్క్సిజం, మావోయిజమే మార్గమని నిరూపించే రచన అంటరాని వసంతం. అంబేద్కరిజాన్ని చర్చించని రచన ఇది. అందుకే, ఈ నవలను దళిత నవలగా గుర్తించడానికి ప్రా॥ పురుషోత్తం నిరాకరించారు.

కమ్యూనిస్టు పోరాటాలే దళితులకు మేలు చేశాయని చెప్పటం ప్రధానోద్దేశం. గాంధీ, కాంగ్రెసు పార్టీ దళితులను మోసం చేశారనీ, బిర్లా వంటి కరుడుగట్టిన హిందూవాదిని గాంధీ వెనుకేసుకొచ్చాడనీ, గాంధీ హరిజనోద్ధరణ కార్యక్రమం మోసపూరితమైందనీ రచయిత ఉద్దేశం. ఈ విషయాలన్నీ డా॥ అంబేద్కర్ తన 'గాంధీ, కాంగ్రెస్ అంటరానివాళ్ళకు చేసిందేమిటి' అనే గ్రంథంలో పేర్కొన్నవే. జి. కళ్యాణరావు అక్కడక్కడా అంబేద్కర్ పేరు మాత్రమే ప్రస్తావిస్తూ పెరియార్ రామస్వామి పేరును ఎక్కువసార్లు ప్రస్తావిస్తాడు. పెరియార్ రష్యా, క్యూబా వంటి కమ్యూనిస్టు దేశాలు తిరిగొచ్చిన తర్వాత ఇండియాలో కూడా విప్లవం రావాలని కోరాడు. 15 ఆగష్టు 1947 న వచ్చింది స్వతంత్రమే కాదనీ, ఈ స్వతంత్రాన్ని బహిష్కరిస్తూ నిరసన తెలపాలని పెరియార్ అనిని సందర్భం ఈ నవలలో రామానుజం పాత్ర ద్వారా ప్రస్తావించబడుతుంది. రచయిత లక్ష్యానికి అనుకూలంగా వున్న అంశాలను పెరియార్ నుంచి తీసుకున్నాడు. కమ్యూనిస్టుపార్టీ ఆనాడే మనకు సంపూర్ణస్వరాజ్యం రాలేదు, కాబట్టి ప్రజలు ఈ వేడుకలకు దూరంగా ఉండాలని కోరింది. నిజమైన స్వతంత్రం కోసం పోరాడాలని పిలుపునిచ్చింది.

అంబేద్కర్ కూడా అధికార బదలాయింపు పట్ల తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేశాడు. కానీ, రాజ్యాంగ రచన ద్వారా ప్రజలకు నిజమైన స్వేచ్ఛను ఇవ్వాలని తలచాడు. కళ్యాణరావుకు, రాజ్యాంగంపట్ల, రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల విశ్వాసం లేదు. రాజ్యాంగ యంత్రాంగాన్ని నియంత్రిస్తున్న కులాల మీదుండాల్సిన ఆగ్రహాన్ని ఆయన రాజ్యాంగం మీద వెల్లగక్కుతున్నాడు. అందుకే రాజ్యాంగం రాసే సమయంలో జరిగిన చర్చ, అంబేద్కర్ కాంట్రిబ్యూషన్ విషయాలు, ఆయన త్యాగాలేవీ ఈ నవల్లో చర్చకు రాలేదు. "ఈ దేశంలో పీల్చే గాలికి కులముంది తాగే నీటికి కులముంది పారే పంట కాల్వకి, పండే భూమికి కులముంది... మాటాలడే మాటకి కులముంది సాహిత్యానికి, సంస్కృతికి కులముంది రాజ్యానికి కులముంది, దాని చట్టానికి కులముంది న్యాయానికి, న్యాయస్థానానికి కులముంది, శవానికి, స్మశానవాటికకు కులముంది, దేవుడికి కులముంది, దెయ్యానికి కులముంది" రచయిత (కళ్యాణరావు, జి: 2008, 197) అంటాడు. కానీ కులసమస్యకు పరిష్కారం మాత్రం కమ్యూనిస్టు పోరాటాలతోనే సాధ్యమని రచయిత సంకేతిస్తాడు. ఈ నవలలో కులసమస్యకు అంబేద్కరిజమే పరిష్కారమనే చర్చ లేదు. అందమైన వాక్యాల మాటున అలవోకగా అల్లిన త్యాగాల కథతో పాఠకులను మైమరిపించిన

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue 2(April,May,June),2025

కళ్యాణరావు విప్లవోద్యమం యొక్క స్వభావ, స్వరూపాల మీద కిందికుల కార్యకర్తలు, రచయితలు లేవనెత్తిన చర్చను చాలా సుఖంగా విస్మరించాడు.

**సంప్రదించిన పుస్తకాలు:**

కళ్యాణరావు,జి:2000, అంటరానివసంతం,విరసం ప్రచురణ, ఆంధ్ర ప్రదేశ్.
కాత్యాయని,ఎస్:1997, వలస పాలనలో విద్య, ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రభావాలు- స్పందనలు, హైదరాబాద్. విశ్వవిద్యాలయం (అముద్రిత Ph.D వ్యాసం).
కేశవ కుమార్.జి: విప్లవ సాహిత్యోద్యమంలో విరసం పాత్ర ,కళ్యాణరావు. జి (సంపా),విరసం ప్రచురణ, కావలి.
మూర్తి ,వి.వి.న :2011, చెప్పులు కుడుతూ కుడుతూ, మనసు ఫౌండేషన్,బెంగుళూరు.
సత్యనారాయణ, ఎస్వీ (సం):2001,దళిత వాదవివాదాలు,ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం.
సామాన్య,జి: 2012, అంటరానివసంతం విమర్శనాత్మక పరిశీలన,పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.